"రాధా,

ఆశీస్సులు.

నీకు ఉత్తరం రాసి చాలా రోజులయింది.

రోజులేమిటి, ఏళ్లే అయిపోయిందికదూ. . . ఏమిటో, ఏళ్లు గడిచినా రోజులు గడిచినట్టే ఉంది సుమా . . . ఈ మధ్య ఇంట్లో హాయిగా పిల్లలతో, ఆయనతో కాలక్షేపం చేస్తుంటే. . .

చిత్రంగా ఉంది కదూ, సంసారంలోనే సంతోషంగా రోజులు గడుస్తున్నాయని వ్రాస్తుంటే. . .

నిజమేనే. . .

మరి రెండు సంవత్సరాల క్రితం నేను ఉద్యోగంలో చేరినప్పుడు వ్రాసిన మూడు ముక్కల కార్డుకి నువ్వు సమాధానంగా పంపిన మూడు పేజీల ఉత్తరం, ఈవేళ పెట్టెలోనించి బైటపడితే చదివాను. అది చదివాక, మళ్లీ ఈ రోజు ఉత్తరం వ్రాయాలనిపించింది. అంతే! నవ్వకుండా, కోప్పడకుండా ఓపిగ్గా, తీరికగా చదువుతావుగా. చదివినా చదవకపోయినా నేను మాననుగా. . .

బహుశా, ఈ మధ్యకాలంలో ఇంత ఉత్తరం రాయడం. . .

సరే, ఉపోద్ఘాతం ఉపసంహరిస్తాను.

ఆ రోజు సాయంత్రం, అదే నేను ఉద్యోగంలో చేరడానికి మూడు రోజుల ముందు సాయంత్రం, మామూలు ప్రకారం ఇందిర తన ఇరవయ్యారో పుట్టినరోజు పండుగ జరుపుకుంటూ విందుకి పిలవడానికి వచ్చింది.

నీకు తెలుసుగా, అది రాత్రి ఎనిమిదింటికి కాని, పిలుపులకు రాదు. అప్పటివరకూ దాని కేదో వ్యాపకా లుంటాయి. అవన్నీ ఎందు కిప్పుడు . . . అది వచ్చే సమయానికి నేను మా వారితో కొంచెం పేచీలో. . .

ఏముందీ, పెద్ద పిల్ల పుట్టినరోజు వస్తోంది, దానికీసారయినా సిల్కునరికిణీ, జాకెట్టూ కొనమని నేనూ, ఈసారికికూడా మామూలుగానే సాగించేద్దాం, వచ్చే ఏడాదికి నువ్వేది కొనమంటే అదే కొంటానని ఆయనా. . . అంతే. . . దానిమీద రేగింది రగడ! అన్ని సంసారాలలోనూ ఉండేదే ఇది. ఆ రగడ జరుగుతూండగా వచ్చిం దది.

ఎంత సంగ్రామం జరుగుతున్నా, పరాయివాళ్లు వచ్చేసరికి, అంతా చల్లారిపోయి చిరునవ్వులతోనే పలకరిస్తాంగా. సంసార సంగ్రామాలు అందరికీ తెలియనిస్తామా? అంతే, అలా చూస్తావేమిటే, రాధా! అంతేనంటావా?

అది కూర్చుని కాస్సేపు మాటాడి, నన్ను తప్పకుండా పంపమని ఆయనతోకూడా గట్టిగానే చెప్పి వెళ్లింది.

దానికి బొట్టు ఇచ్చి గడపదాకా సాగనంపుదామని వెళ్లాను. అది మెట్లు దిగి, కారు తలుపు తీసి, మళ్లీ వెనక్కివచ్చి, "మీ ఆయనకు జీతమెంతే?" అని అడిగింది. . .

చెప్పాను.

"ఆ మూడు వందలతో ఎలా గడుస్తుందే? ఇద్దరు పిల్లలున్న సంసారం. పోనీ నువ్వుకూడా ఉద్యోగంలో చేరరాదూ? బి. ఏ. దాకా చదువుకున్నావు కదా! ఆలోచించు!" అంటూ నవ్వుతూ వెళ్లిపోయింది.

దాని కారు రోడ్డు మలుపు తిరిగేవరకూ అటే చూస్తూ ఉండిపోయాను. . . అంతవరకూ ప్రశాంతంగా ఉన్న నా మనస్సు దాని ఆలోచనతో కొంచెం చలించింది.



కొంచెమే అని అప్పు డనిపించింది కాని, ఆ రాత్రి పొద్దుపోయేవరకూ ఉద్యోగం విషయమే మనస్సును ఆవరించడంతో అర్థమయింది, అది నా మనస్సులో ఎటువంటి సంచలనం కలిగించిందో. . .

నిర్మలమయిన జలాలతో నిండిన ప్రశాంతమయిన సరోవరంలో ఒక్క గులకరాయి విసిరినా ఎన్ని ఆవర్తాలు ఏర్పడి, ఎంత కల్లోలం చేస్తుందో అంతా అయింది.

ఆ మరునాడు పిల్లలిద్దరు మామూలు ప్రకారం ఎనిమిదింటికే భోజనం చేసి బడికి వెళ్లిపోయారు. ఆయనింకా ఆఫీసు కాగితాలు చూసుకుంటూనే ఉన్నారు. అటువంటి సమయంలో అడక్కుండానే ఆయనకు రెండోసారి కాఫీ ఇవ్వడం అలవాటు. కాఫీఫ్లాస్కు తీసుకుని, కప్పూ, ప్లేటూ తెచ్చి, టేబిల్ మీద పెట్టాను.

ఆయన ఫైలు పక్కకి పెట్టి సిగరెట్ ముట్టించి నా వైపు చూశారు.

అటువంటి సంతోషసమయంలోనేకదా ఏ ఆడదానికయినా తన మనస్సులోని భావాలను భర్తముందు పెట్టడానికి అవకాశం లభించేది.

కాఫీకప్పు అందిస్తూ అన్నాను:

"ఇందిర భారీఎత్తున డిన్నర్ ఇస్తోంది."

"ఆవిడకేం? అయితే ఇప్పు డావిడకి ఇరవై అయిదు నిండాయి కదూ, అందుకని రజతోత్సవ సంబరంగా డిన్నర్" అని నవ్వుతూ కాఫీ తీసుకున్నారు.

"ఈమధ్య దానికి రెండో కొడుకు పుట్టాడుట, ఎరుగుదురా!" అన్నాను.

"ఆ అబ్బాయి బారసాలకు [illegible] విందు చేసిందిగా!" అన్నా రాయన.

"ఊం! అంత గుర్తుంది మీకూ" అని నేను నవ్వి "అదీ నన్ను ఉద్యోగం చెయ్యమంటోంది" అని చాలా నెమ్మదిగా, తల వంచుకునే.

ఆయన ఆ మాట వింటూనే కాఫీకప్పు [illegible] మీద ఉంచి, ఒక్కసారి నా వైపు తిరిగారు.

అప్పు డాయన కళ్లల్లో కదలాడే ఊహలు చదవా

# మమకారం

అనుకున్నాను. కాని ఆ అక్షరాలన్నీ అయోమయంగా అలుక్కుపోయి కనిపించాయి. అక్షరాలే అలుక్కుపోయాయో, నా కళ్లే కొద్దిగా మసక కమ్మాయో ఇప్పటికీ సందేహంగానే ఉండిపోయిందంటే. . .నీవు. . . నవ్వు నవ్వుతున్నావు కాదే, రాధా. నవ్వకు. నా జీవితంలో జరిగిన ఒక సంఘటనని ఈ ఉత్తరంలో కథలాగే రాస్తున్నాను.

జీవితానుభవాల్ని కథగా మలచగలగడం కంటే గొప్ప కళ లేదనేవారు మన ప్రిన్సిపాల్‌గారు, గుర్తుందా?

సరే, ఆయన నా మాట విని, క్షణం నా కళ్లలోకి చూసి, ఒక నిట్టూర్పు విడిచి, "ఇందిర చెప్పిందా? నీకు చెయ్యాలని ఉందా?" అని అడిగారు.

"మీకు కోపం వచ్చినట్టుంది" అని నేను ఇంగమూతి పెట్టి లేవబోయాను.

మా వారికి కోపం వస్తే బహు ముక్తసరిగా మాటాడతారు. అదే గుర్తు. అంతే! నేను మరేమీ అనకుండా కూచున్నాను.

"కోపం దేనికి! చదువుకున్నదానివి, ఆలోచించగల దానివి, విచక్షణగల ఇల్లాలివి" అంటూ లేచారు.

"ఇ. . . ల్లా. . . లి. . .వి" అన్న అక్షరాలతో ప్రతి ఒక్కదాన్నీ నొక్కి పలికారే! అంతగా ఆ అక్షరాలెందుకు నొక్కుతూ పలికారో ఆ క్షణంలో అర్థం కాలేదు.

"ఊరికే అన్నాను. దానికి మీ రింత బాధ పడ్డం దేనికి?" అన్నాను. అన్నానే కాని, ఆయనకు నా అభిప్రాయం నచ్చనందుకు నే నెంతో బాధపడ్డాను, ఆ సమయంలో.

ఆయన మౌనంగా స్నానం చేసి, ముక్తసరిగా మాటాడుతూ భోజనం ముగించి, ఆఫీసుకి చక్కాపోయారు.

> డబ్బు అన్ని కష్టాలను మరపిస్తుందనీ, అన్ని సుఖాలనే కలిగిస్తుందనీ అనుకోవడం భ్రమ. మమకారాలు, వాత్సల్యాలు డబ్బు సంపాదనతో పెరగవు. స్త్రీ....అందునా చదువుకున్న స్త్రీ సంపాదనపట్ల ఆసక్తి పెంచుకుంటే కట్టుకున్నవానికి, కన్నపిల్లలకు, వారి ప్రేమానురాగాలకు దూరం అవుతుంది.

సాధారణంగా ఆయన భోజనానికి కూర్చుంటూ నన్నుకూడా కూర్చోమనడం మామూలు. ఆ పూట ఆ మాటకూడా అనకుండా, చాలా ముక్తసరిగా మాటాడుతూ వెళ్లిపోవడంతో, నేను కొద్దిగా మనస్సులో బాధ పడ్డా, దాన్ని తుడిచేసి నా ఉద్యోగవిషయం ఆలోచిస్తూ మంచంమీద నడుం వాల్చాను.

రకరకాల ఆలోచనలతో ఆకలిమాటే మరిచి నిద్ర పోయాను. ఒంటిగంటకు పిల్లలిద్దరూ వచ్చి తలుపు తట్టాక మెలకువ వచ్చేసింది.

బద్ధకంగా లేచి వాళ్లిద్దరికీ అన్నాలు పెట్టేశాను. మళ్లీ వాళ్ళు బడికి బయలుదేరి గడప దిగుతూండగా అబ్బాయి అడిగాడు, "అమ్మా! ఈ వేళ పూరీలు చేస్తానన్నావు గదటే?" అని. వాడి మాటలు నాకు వినపడ్డా నేను జవాబివ్వకుండానే తలుపులు వేసేశాను.

నేను మౌనంగా వాళ్లకి అన్నం పెట్టిన రోజు వాళ్లు అర్ధాకలితోనే తిని వెడతారని నాకు తెలుసు! ఆ పూట అలాగే వెళ్లారు. ఉద్యోగం విషయమై తీవ్రంగా ఆలోచిస్తూన్న నా మనస్సు పిల్లల అన్నం విషయంలో ఆలోచించలేకపోయింది. అలానే వెళ్లి మంచంమీద పడుకున్నాను. ఆకలి వేసినట్టే లేదు. నిద్రాపట్టడం లేదు. 'ఏఉద్యోగంచేస్తే బాగుంటుందా?' అన్న ఆలోచన నా మనసులో గిరగిర తిరుగుతూంది.

మనతో చదివినవాళ్లలో కొందరు చేసే ఉద్యోగాలన్నీ గుర్తుకి వచ్చాయి. రేడియోలో ఎనౌన్సరుగా చేరినా, టెలిఫోన్ ఆపరేటర్‌గా ప్రవేశించినా వేళకాని వేళల్లో నానా అవస్థలు పడాలి. పైగా అవేవీ అనుకున్నప్పుడు దొరికే ఉద్యోగాలు కావు. పోతే స్కూలుమేస్టరీ ఒకటుంది. దానికి ట్రైనింగు కావాలే! టైపిస్టుగా అయితే ఫర్వాలేదు. మరి నేర్చుకోవాలిగా అదైనా! ఎబ్బెబ్బే, ఇవేం కాదు. . .

కాకపోతే ఏముంది? గుమాస్తాపని చేయాలి. రోజూ పదింటి కెళ్లాలి. బస్‌స్టాప్‌లో క్యూలో నిలబడి మళ్లీ అయిదింటికి చచ్చే నీరసంతో బస్‌స్టాప్‌లో క్యూలో మళ్లీ హాజరవ్వాలి. ఇంతకీ నేనసలు ఉద్యోగం చేయగలనా అని? ఇంతమందిచేస్తూండగాలేనిది, నేచేయలేనాఏమిటి? ఏ ఉద్యోగం చేయడం అనేది ఇందిరే నిర్ణయించాలి.

అసలు ముందు ఈయన ఒప్పుకోవాలిగదా! ఉద్యోగం మాట ఎత్తేసరికే ఆయనకి కోపం వచ్చేసింది. మళ్లీ కదిపితే ఏమంటారో? అయినా ఏమిటో ఈ మగాళ్ల మనస్తత్త్వం? 'ఏమయినాసరే, ఈవేళ సాయంత్రం ఆయన్ని ఒప్పించాలి' అనుకుంటూ మంచం దిగాను. అప్పుడే గడియారపు చిన్నముల్లు నాలుగుమీద ఉంది. పిల్లలు వచ్చే వేళయింది. వాళ్ల కేదో చేసిపెట్టాలి. గోధుమపిండి కలిపాను. పూరీలు వేయడం మొదలెట్టాను.

నాలుగైదు తీసేసరికి పిల్లలిద్దరూ వచ్చారు. నవ్వుతూ వాళ్లని పలకరించాను.

ఇద్దరూ బట్టలు మార్చుకుని, కాళ్ళ చేతులు, ముఖం కడుక్కుని వచ్చి పీటలు వాల్చుకుని కూచున్నారు. చెరో రెండు పూరీలు పెట్టాను. నోట్లో వేసుకుంటూనే "అమ్మా? ఉప్పు లేదే!" అన్నాడు కుర్రాడు. అప్పుడు గుర్తు వచ్చింది, నా మనసు మనసులో లేదనీ. . . అంతా ఉద్యోగాన్వేషణలోనే ఉందనీను. . .

రాత్రి వంటకూడా ఏం పాడవుతుందో అని భయపడ్డాను.

నువ్వు నవ్వకు. . . రాధా. . . అనుకున్నంతా అయింది. . .అన్నిట్లోనూ ఉప్పు ఎక్కువయింది. . .

ఆరు గంట లవుతూండగా ఆయన ఇంటికి వచ్చారు.

అలవాటు ప్రకారం కాళ్ళు కడుక్కుందుకు నీళ్లిచ్చాను, మంచినీళ్లగ్లాసు అందించాను.

ఆయన నా వైపు అదోలా చూశారు.

ఇదివరలో అయితే, "దేవిగారు వరాకు చిత్తగిస్తున్నట్టున్నారు!" అని హాస్యమాడేవారు. ఈవేళ అది లేదు. . .

మౌనంగా గ్లాసు డ్రాయరుమీద ఉంచేశారు. నెమ్మదిగా దొడ్డివైపు నడిచేశారు. నా పొరబాటు తెలుసుకుని గబగబా దొడ్లోకి అడుగులు వేశాను. ఆయన అంతట్లోనే కాళ్ళు కడిగేసుకున్నారు. అలా ఆ రోజు అన్నీ అస్తవ్యస్తమే అయ్యాయి. భోజనందగ్గరకూడా ఆయన ముభావంగానే కూర్చున్నారు. ఆయన కోపం తగ్గలేదని తెలిసినా, అది తగ్గించడానికి శాయశక్తులా ప్రయత్నించాను. కాని తగ్గలేదు. ఆయనకి కోపం—చెప్పానుగా, మౌనమే ఆయన కోపానికి లక్షణమని. ఆయన అన్నం తింటూ రెండు మూడు సార్లు ఎందుకు చూశారో, నేను తినేప్పుడు గాని తెలీలేదు. ముద్ద నోట్లో పెట్టుకునేసరికి ఉప్పుకషాయం. అప్పు డూహించాను, ఆయన అన్నం తినేప్పుడు అలా ఎందుకు చూశారో!

ఇంక నా పథకం ఎలా నడపాలో బోధపడలేదు. ఆ పూట పనులన్నీ వరాకుమీదే నడిచాయి. . . ఆయన చిరాకునీ హెచ్చించాయి. . .

వంటింటిపనులు పూర్తిచేసుకుని ఇవతల గదిలోకి వచ్చాను. "ఇందిర విందుకి పిలిచినట్టుంది" అన్నారాయన, చదువుతున్న పేపరులోనే దృష్టి నిలిపి. . .

అదికూడా మరిచిపోయాను. . . నవ్వుతూ ఆయన దగ్గిరగా వెళ్లాను. ఆయన తల తిప్పలేదు. . .

దృష్టి కదిలించలేదు. . .

"ఇందిర ఉద్యోగం మాట అడిగితే ఏం చెప్పను?" అని అడిగాను. . .

"చేస్తానని చెప్పు. . ." అన్నా రాయన చాలా గంభీరంగా.

"మీ కింకా కోపం తగ్గలేదు" అన్నాను నవ్వుతూనే.

"నా కసలు కోపం రాలేదు" అని అంటూన్నప్పుడు కూడా ఆ గాంభీర్యం మామూలుగానే ఉంది.

ఇంతలో వీధిలో కారు హారన్ మోగింది.

ఇందిర రానేవచ్చింది. హాయిగా నవ్వుతూ పిల్లలిద్దర్నీ పలకరించి, "ఏమోయ్! కూడా ఉండి తీసుకెడితేగాని రావేమిటి. . . నువ్వు?" అంది, మే మిద్దరం ఉన్న గదిలోకి వచ్చి.

"తోడు లేకుండా వెళ్లే అలవాటు లేదు" అని ఆయన నవ్వుతూ లేచారు. "రేపు ఇది ఉద్యోగంలో చేరితేకూడా తోడు ఉండాలేమో!" అని ఇందిర నవ్వుతూ, "మేస్టారూ, మీరు నా మాట కాదనకండి. వేణ్ణీళ్లకు చన్నీళ్ళ తోడు. మా నాన్నగారు కొత్తగా ఫ్యాక్టరీ అరంభిస్తున్నారు. అందులో ఓ చిన్న ఉద్యోగం

"అమృతం"

ఇస్తాను. మీరు ఏరేనంటే వచ్చే నెల ఒకటో తారీఖునే చేరాలి'' అంది.

''ఇవ్వేదానివి నువ్వు, చేసే దానివి. మీ ఇద్దరికీ ఇష్టమయినప్పుడు, నా అభ్యంతరమేమిటిసి'' అన్నారాయన.

ఇందిర పకపక నవ్వుతూ, ''మరి మాకు సెలవా?'' అంది. ఇద్దరం బయలుదేరాం. . .

సరే! విందుభోజనాలు, అక్కడి విశేషాలు ఇవన్నీ రాసి నిన్ను విసిగించ దలుచుకోలేదు. ఆ రాత్రి నా ఉద్యోగవిషయం నిర్ణయమయిపోయింది. పదకొండు గంటలకి వెళ్ళడం, నాలుగింటికి తిరిగిరావడం—బాగానే ఉందనిపించింది.

పిల్లలు, ఆయన వెళ్ళాక నేను ఆఫీసుకి వెళ్ళచ్చు. వాళ్ళెవరూ ఇంటికి రాకుండానే తిరిగి వచ్చేయచ్చు. అటువంటప్పుడు న్యాయానికి ఆయనకే అభ్యంతరం ఉండకూడదు.

రెండు మూడు రోజులు శ్రమపడితే చెయ్యవలసిన పనికూడా సులువుగానే అలవాటయిపోతుంది.

ఆ. . . ఏమిటో ఇవన్నీ బ్రహ్మవిద్యలా?

''ఆయన నవ్వుతూ ''ఊఁ...'' అంటే బాగుండును' అనుకుంటూ ఇంటికి వచ్చాను.

పిల్లలిద్దరూ నిద్రపోతున్నారు.

ఆయనేదో పేపరు చదువుతూ కూర్చున్నారు.

''పది అవుతూంది, ఇక పడుకుందామా?'' అన్నాను ఫ్లాస్కుమూత తీసి అందులో ఉన్న పాలు గ్లాసులో పోసి అందిస్తూ.

ఆయన మౌనంగా అందుకుని, నా వైపు చూడకుండానే పాలు పూర్తిగా తాగేసి, గ్లాసు డ్రాయరు పైన పెట్టారు.

మామూలుగా అయితే గ్లాసులో సగభాగం నా కందిచ్చేవారు.

నా కర్థమయింది, ఇంకా ఆయనకి కోపం తగ్గ లేదని.

ఎలా అయినా సుముఖం చేసుకోవాలని చాలా ప్రయత్నాలు చేశాను. . . కాని ఫలించలేదు.

నే నేం చెప్పినా, ఆయన ఒక్క మాటు నా కళ్ళలోకి చూడ్డం, ఊకొట్టడం తప్ప, సంభాషణని పొడిగించ నివ్వలేదు. ఆఖరికి అన్నాను.

''మీరు తెచ్చేది బొటాబొటిగా సరిపోతూంది. నేనుకూడా రెండు వందలు తెస్తే మన పిల్లల కింకా మంచి తిండి పెట్టచ్చు. ఇంకో రెండు గుడ్డలు ఎక్కువగానూ కొనచ్చు. . .'' అన్నాను.

''అవును, మనంకూడా ఓ వంటమనిషిని, ఓ పనిమనిషిని పెట్టుకోవచ్చు'' అన్నారు చాలా గంభీరంగా.

''ఇంతకీ, నన్ను చేరమంటారా? వద్దంటారా?. . . ఉద్యోగం చేస్తున్నంత మాత్రంచేత, ఇంటిపని, వంటపని మానెయ్యాలని లేదే? మీ కిష్టంలేకపోతే రేప్పొద్దున్నే చెప్పేస్తాను రానని. . .'' అన్నాను బాధతో నిండిన కోపంతో

''అవసరం లేదు. చదువుకున్నదానివి. . . మంచి చెడు తెలిసినదానివి. . . నీ అంతట నువ్వే అందులో బాగోగులు తెలుసుకున్నాక. . .'' అని మాట మధ్యలోనే తుంచేసి, లైటార్పేసి వెళ్ళి పడుకున్నారు.

ఆ రాత్రంతా సరిగా నిద్ర పట్టలేదు.

పరిపరివిధాల ఆలోచించాను.

అలిసిపోయాను. తెల్లవారుఝామున ఏ నాలుగింటికో నిద్ర పట్టింది. మరునాడంతా మౌనంగానే సాగించేశారాయన.

నే నెంత కల్పించుకు మాటాడదా మనుకున్నా ఆయనేదో పని హడావిడిలో ఉన్నట్టు నటించారు. విజంగా నటనే అది.

నాకు తెలుసు. . . అయినా నేనుకూడా నోరు మూసుకు గడిపేశాను. . . ఆ రాత్రి పదింటికి, ఆయన నిద్రక లేస్తూ ''రేపకదూ నీవు ఉద్యోగంలో చేరేది. మన ఇంటికి వేసే తాళానికి డూప్లికేటు ఉందా?'' అన్నారు.

''అంత అవసరం లేదు. . . మీకంటే ముందే వస్తాను ఇంటికి'' అన్నాను.

''నువ్వు, నేనే కాదు. మనకో ఇద్దరు పిల్లలున్నారు'' అని భారంగా నిట్టూర్చారు.

నాకు చాలా కోపం వచ్చింది. దాన్ని మించిన బాధ కూడా కలిగింది. కన్నతల్లిని...కనడమే కాదు, వాళ్ళకి కాస్తంత ఒళ్ళు వెచ్చగా ఉంటే గిజగిజలాడిపోయి వేళకి తిండీ, నిద్రకూడా లేకుండా కనిపెట్టుకుని కూర్చునేదాన్ని . . . అటువంటి దానికి పిల్లల విషయం గుర్తు చేయడం ఎంత బాధగా ఉంటుందో వీలాటిది ఊహించలేదు, రాధా!

అయినా సంసారభారం పూర్తిగా ఆయనమీదే విడవకుండా నేనుకూడా పంచుకోదలుచుకున్నాను కనక, ఆయనంతట ఆయనకు తెలిసివచ్చేవరకు మౌనంగా గడపడమే మంచిదనుకున్నాను. సరే! ఉద్యోగంలో చేరాను. ఆరు మాసాలు గడిచిపోయాయి. అప్పటికి ఫ్యాక్టరీ బాగా పెరిగింది, నా పనికూడా ఎక్కువయింది. గంట అదనంగా పనిచేస్తే, దానికి రెండున్నర రూపాయిలిస్తారు. రోజుకు కనీసం రెండు గంటలయినా అలా ఉండగలిగితే అయిదారు రూపాయలు వస్తాయి నెలకి నూటఏభై రూపాయలు. ఈ ఆరు మాసాల్లో ఆయనలో పెద్ద మార్పేమీ లేదు గాని మౌనం, ముభావం కొంత తగ్గి, పూర్తిగా మామూలు ధోరణికి రాకపోయినా, కొంతలో కొంత కులాసాగానే గడపగలిగారు.

ఆ రోజుల్లో ఓనా డన్నాను, ''ఆఫీసు పని మరీ ఎక్కువౌతూంది. అక్కణ్ణించి వచ్చాక అలసట ఎక్కువై ఇంటిపని చేసుకోలేకపోతూన్నాను. వంటకి ఓ ముసలావిణ్ణి పెడితే బాగుంటుంది'' అని.

అప్పటిమట్టుకి ఆయన విని నవ్వేశారు.

మరునాడు సాయంత్రానికి ఇంట్లో వంటమనిషి ప్రత్యక్షమయింది. తెల్లారేసరికి పెంట, పాచి చెయ్యడానికి ఓ మనిషి వచ్చింది.

ఎప్పుడూ ఇంటివిషయాల్లో జోక్యం కలిగించుకోని మనిషి, ఇంత శ్రద్ధ తీసుకుంటూంటే, ఆయన లోపలోపల నా ఉద్యోగంపట్ల విముఖంగా లేరనుకున్నాను.

మరో [illegible] మాసాలు గడిచాయి.

ఆ రోజు ఆదివారం. అయినా నా ఉద్యోగం ఫ్యాక్టరీలో [illegible] ఆలస్యమైంది. పిల్లలిద్దరూ [illegible] కూర్చున్నారు.

పండిత డి. గోపాలాచార్యులవారి
బాల ప్రాశ
బిడ్డలకు
రుచికరమైన టానిక్కు
1898 నుండి ప్రసిద్ధిగాంచినది
ఆయుర్వేదాశ్రమం
ప్రైవేట్ లిమిటెడ్
[illegible] మద్రాసు-17

ఉచితము! స్టాకులున్నంతవరకు హిమసార్ ఆయిల్ ప్రతి సీసాతోను ఒక దువ్వెన ఉచితము. త్వరపడండి!




జుత్తు పోషణకు సాటిలేనిది
హిమానీ
హిమసార్
ఆయుర్వేద విధానంతో
తయారుచేయబడిన తలనూనె
గత 50 సంవత్సరాలుగా ప్రసిద్ధిగాంచినది
హిమానీ ప్రైవేట్ లి.
కలకత్తా-2

ఏజంట్లు: మెస్సర్స్. కె. కృష్ణమూర్తి అండ్ కం.,
బ్రాహ్మణ వీధి విజయవాడ-1.

Progressive,HIMANI-19

ఆయన పేపరు చదువుతూ కూచున్నారు.

మామూలుగా అయితే ఆవేళప్పుడు ఆయన నిద్రపోతూ ఉండడం, పిల్లలు కేరమ్స్ ఆడుకోడం అలవాటు. అయినా నేనేమీ పట్టించుకోలేదు.

బాగా అలిసిపోయి ఉన్నానేమో, కాళ్ళు ముఖం కడుక్కొని పడుకు వాల్చాను. మాగన్ను పడుతూంది.

"ఒరేయ్, తమ్ముడూ! అమ్మతో నువ్వు చెప్పరా!' అంది పెద్దపిల్ల.

"అమ్మతో మాట్లాడ్డానికి నాకు భయంగా ఉంది" అని మరీ నెమ్మదిగా అంటున్నాడు పిల్లాడు.

అది వింటూన్న నాకు గుండె చెరువయిపోయింది.

కన్నతల్లితో మాట్లాడ్డానికికూడా పిల్లలు భయపడుతున్నారు. . . నా కళ్ళు తడిసిపోయాయి.

అప్పుడు గుర్తు వచ్చింది. . . రెండు, మూడు నెలల నించి వాళ్ళతో అరగంట కూర్చోడానికికూడా నాకు తీరిక దొరకలేదు.

అమాంతం మంచంమీద నించి లేచాను. పిల్లల దగ్గిరికి వెళ్ళి కూర్చున్నాను.

ఇద్దరూ బావురుమన్నారు.

అయిదారు నిమిషాలు ఏమీ మాటాడలేక పోయాను. ఇద్దరి ముఖాలకేసే చూశాను. . . బిక్కుబిక్కుమంటూ భయపడుతూ చూస్తున్నారు. . .

"ఏం? నాన్నా? అక్కేమిటి చెప్పమంది?" అన్నాను బుజ్జగిస్తూ. . .

"అమ్మా, మరేమో అక్కకి పరీక్షలో పంతొమ్మిదో రేంక్ వచ్చింది. టీచరు కోప్పడ్డారు. . ." అని వాడు చెబుతూండగానే, "అమ్మా! తమ్ముడికి లెఖ్ఖల్లో సున్న వచ్చిందిట, వాళ్ళ మేస్టారు నాన్నకి చీటీ రాసి పంపించారు. ఈ రోజు మధ్యాహ్నం నాన్న అన్నం తినలేదు. వంటావిడ పొద్దున్నే వండేసి, ఒంట్లో బాలేదని వెళ్ళిపోయింది" అని పిల్ల అందుకుంది. అంతలోనే ఆయన లోపలికివచ్చి, "తిరిగి తిరిగి వచ్చినప్పుడు అమ్మ దగ్గిర గొడవ చెయ్యొద్దని ఎన్ని సార్లు చెప్పాను మీకు" అన్నారు చాలా కోపంగా. . .

ఒక్కసారి ఆయన ముఖంవేపు చూశాను. . .

మనిషి బాగా పాడయిపోయారు. . .

కళ్ళు బాగా లోతుకు పోయాయి. . .

ఆ స్థితిలో ఆయన్ని చూసేసరికి నా మనసు వికలమయిపోయింది. . .

ముద్దబంతి పువ్వుల్లా ఉండే పిల్లలు ముడుక్కొడల్లా అయ్యారు. . .

ఏమీ మాటాడలేని స్థితిలో పిల్లల్ని దగ్గిరగా తీసుకుని కౌగలించుకున్నాను. . .

అప్పు డాయన అందుకున్నారు. . .

"ఎందు కింత బాధపడతావు?

పిల్లల చదువులు పాడయితే, మరో ముప్ఫయి రూపాయ లిచ్చి ట్యూషన్ పెడదాం. మనకేం లేదా, పోదా? వంటమనిషికి రెండు పూట తిండిపెట్టి, ఏభై రూపాయ లిస్తున్నాం. పనిమనిషికి ఇరవయి రూపాయ లిస్తున్నాం. నువ్వు ఆఫీసుకి వెళ్ళి రావడానికి రోజూ రెండు రూపాయల చొప్పున రిక్షా ఖర్చుల పోను, మధ్యాహ్నం నీకు, నాకు, పిల్లలకి కలిపి రోజూ మూడు రూపాయల టిఫిన్ ఖర్చులు. . .

ఇవన్నీ ఇలా ఉండగా ఇంటికి సామాను తెచ్చేప్పుడు పనిమనిషి కొట్టే కమీషన్ పాతిక రూపాయలు. వంటమనిషి జేరవేసే సరుకు ఏభై రూపాయలు. . . పోతే, వీళ్ళకి ట్యూషన్‌కి ఓ ముప్ఫై రూపాయలు. నువ్వు ఇంకో గంట ఓవర్ టైం చేస్తే సరిపోతుంది. దీని కింత బాధెందుకు?

కట్టుకున్నవాడికి, కన్నపిల్లలకి ప్రేమ, వాత్సల్యం దూరమయితేనేం! డబ్బుంటే అన్నీ మరిచిపోవచ్చు. . . దానిముందు మమకారాలు, వాత్సల్యాలు ఎందుకూ కొరగావు. వెళ్ళి కాస్సేపు పడుకో. వాళ్ళింకా నిన్ను అమ్మ అనుకుంటున్నారు. . .

నాన్నకంటే పది రాళ్ళు ఎక్కువ తెచ్చే ఉద్యోగస్థురాలనుకోలేదు. వెళ్ళు. . . విశ్రాంతి తీసుకో" అని ఆయన మాటాడుతూంటే ఒక్కో మాటే నా గుండెల్లో బల్లెంలా దిగింది.

పది, పదిహేను నిమిషాలు ఏమీ మాటాడలేక పోయాను. జరుగుతూన్న విషయాలన్నీ ఆయన విడమరిచి చెప్పేవరకూ నే నెప్పుడూ ఆలోచించలేదు.


ఏ ఉద్దేశ్యంతో నేను ఉద్యోగంలో చేరానో అది నెరవేరకపోగా పిల్లల ఆరోగ్యాలు పాడయ్యాయి. వాళ్ళ చదువూ పాడయింది. ఆయన మనస్సుకి ప్రశాంతత లేదు.

నే నేం సాధించినట్టు! ఈ ఆలోచనలతో నా బుర్ర వేడెక్కిపోయింది.

హృదయానికి హృదయం కలిపి, మనసిచ్చి మనస్సు పుచ్చుకునే అనుకూల దాంపత్యసుఖాన్ని దూరం చేసుకున్నాను.

పెదవి విప్పి పరుషవాక్యం పలక్కుండా చిన్న మందలింపులతో, చెప్పినట్టు వినే పిల్లల్ని నన్ను చూసి దుఃఖపడే స్థితికి తెచ్చుకున్నాను.

అలు మమకారానికి దూరమయాను.



చిత్రం — రుక్మిణి (హోర్నుకల్)

ఇటు వాత్సల్యము కరిగించేశాను.

'రాధా! ఏమిటి నే సాధించింది? జీవితంలో కష్టసుఖాల్లో భాగం పంచుకునే నా వారూ దూరమయి, మంచిచెడ్డలకు నా మీద ఆధారపడ్డ పిల్లలకూ కాకుండా పోయాక, నే నెంత సంపాదించి ఏం లాభం? ఇదంతా ముందే ఆలోచించి ఉండవలసింది!

అప్పుడు ఈ పరిస్థితి ఏర్పడేది కాదు.

ఇప్పటికైనా మించిపోయింది లేదు.

'చేతులు పూర్తిగా కాలిపోలేదు' అనుకుని లేచాను.

ఆయన కాఫీఫ్లాస్కు తీసుకుని నా దగ్గిరికి వచ్చారు.

నా ప్రాణం పోయినంత పని అయింది.

ఆయన చేతిలోంచి ఫ్లాస్కు తీసుకోబోయాను.

"ఫర్వాలేదు. . . కూచో! ఎప్పుడూ నువ్వే ఇస్తే ఏం బాగుంటుంది? నన్నుకూడా కొంత సేవ చేయనీ" అన్నా రాయన నవ్వుతూ.

నా గుండెలో గుండుసూదులు గురగురలాడాయి! ఆయన నవ్వుతూనే అన్నా, ఆ నవ్వు వెనకనించి రివ్వున దూసుకువచ్చే వాడిబాణాలులా నన్ను వేధించడం మొదలెట్టాయి.

ఆయన మాటల ధోరణి తెలికపోతే ఆ వాడిలోని వేడి నన్ను బాధించేది కాదు.

ఇదివరలోకూడా ఒకటి రెండు సార్లు అటువంటి వేడి చవిచూశాను. . . కనక నా కర్మమయింది, రాధా! ఇంకేం రాయను. . . ఉద్యోగం వదిలేశాను.

ఇప్పు డెంత సుఖంగా ఉన్నామో నా కనుభవంమీద తెలిసింది

అదంతా రాయడం నా కిష్టం లేదు.

ఒక్క మాట నువ్వు వచ్చి చూసి వెళ్ళు...

ఇట్లు

నీ కుంతల." ★